## క్లుప్తంగా

### సోషల్ ఆడిట్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ కోటయ్య

**పాణ్యం:** స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ కోటయ్య మండలంలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. సోషల్ ఆడిట్‌లో గణన జరిగే అంశాలపై వివరాలు అందజేయాలన్నారు. స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టూడెంట్ అకాడమిక్, సీఓ కరికులర్, స్టూడెంట్ సేఫ్టీ ఎంటిల్‌మెంట్, టీచర్ ఫర్ఫార్మెన్స్, ఈక్విటీ ఇండికేటర్ తదితర వాటిపై ఆడిట్ జరుగుతుందన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సీఓ సూచించిన మేరకు సహకరించాలన్నారు. సీఓ వెంకటేశ్వర్లు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

### పుస్తకాల పంపిణీ

**పాణ్యం:** నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్

**సి.బెళగల్:** మండలానికి మొదటి విడత పాఠ్య పుస్తకాలు సోమవారం చేరినట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు. మండలంలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అవసరమైన 40 టైటిల్స్‌కు సంబంధించి మొదటి విడతలో 36,170 పుస్తకాలు మంజూరయ్యాయని, వీటిని త్వరలోనే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తామన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరిన పాఠ్య పుస్తకాలను సీఆర్పీలు శ్రీనివాసులు, వెంకటరాముడు, మాదన్న, శోభారాణి సోమవారం తరగతి, సెమిస్టర్, మీడియంల వారీగా సర్దిపెట్టారు.

### తాగునీటి సమస్య పరిష్కరించాలి

**సి.బెళగల్:** స్థానిక రెండవ వార్డు కాలనీలలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు అధికారులను కోరారు. సోమవారం ఆయా కాలనీలకు చెందిన మహిళలు, ఖాళీ బిందెలతో మండల పరిషత్ కార్యాలయం చేరుకుని సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన గ్రామ సర్పంచ్ పాండురంగన్నతో చర్చించి సమస్య పరిష్కారానికి మార్గం చూపాలని సూచించారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలలో మంచి నీటి సమస్యను వారం రోజులోగా పరిష్కరిస్తామని కాలనీ వాసులకు సర్పంచ్ హామీ ఇచ్చారు.

### పనుల అడ్డగింత



పెంచికలపాడు ముస్లిం శ్మశాన వాటికలో రస్తా పనులను అడ్డుకున్న స్థానికులు

**గూడూరు రూరల్:** పెంచికలపాడు గ్రామంలో మైనారిటీలకు చెందిన శ్మశాన వాటికలో ప్రైవేట్ వ్యక్తులు చేపట్టిన రస్తా పనులను సోమవారం స్థానిక ముస్లింలు, ప్రజలు అడ్డుకున్నారు. గ్రామంలో పవన విద్యుత్ టవర్ల ఏర్పాటుకు ప్రైవేట్ సంస్థ రైతుల భూములను కొనుగోలు చేసింది.ఆ భూములకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉంది. అయితే శ్మశాన వాటిక నుంచి వెళితే త్వరగా గమ్యస్థానాన్ని చేరుకోవచ్చన్న ఉద్దేశంతో రస్తా పనులు చేపట్టారు. గ్రామ పంచాయతీ, స్థానిక ముస్లిం మత పెద్దలు, గ్రామ పెద్దలకు సమాచారం ఇవ్వకుండా శ్మశాన వాటికలో రోడ్డు ఏర్పాటుకు ప్రైవేట్ కంపెనీ జేసీబీతో పనులు చేపట్టింది. విషయం తెలుసుకున్న ముస్లింలు, గ్రామ పెద్దలు శ్మశాన వాటికకు వచ్చి పనులను అడ్డుకున్నారు. శ్మశానానికి ఉన్న కొద్ది స్థలంలో రోడ్డు వేస్తే తమకు ఇబ్బందులు ఎదురవుతాయని, రెవిన్యూ, పోలీసు అధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

### సాయినాథుని ప్రభోత్సవం



సాయినాథుని ప్రభను లాగుతున్న భక్తులు

**కోడుమూరు రూరల్:** మండలంలోని పులకుర్తి గ్రామంలో వెలసిన సాయినాథుడి 2వ మహా రథోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామి వారి ప్రభోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. సాయినాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై ఆశీనుల చేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- పంచాయతీ సిబ్బంది పిలుపు
- ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

# పేదరిక నిర్మూలనకు కృషి చేద్దాం



పాణ్యంలో గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ మేకల పల్లవి, ఈఓ అనురాధ



కోడుమూరులో కేక్ కట్ చేస్తున్న సర్పంచు భాగ్యరత్న

**సి.బెళగల్:** ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులతో పేదరిక నిర్మూలనకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగలు కృషి చేయాలని ఎంపీడీఓ రాముడు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లతో కలిసి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు, పరిధి, బాధ్యతలపై ఎంపీడీఓ మాట్లాడారు. ఈఓఆర్డీ సందీప్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల అధికారాల ద్వారా ప్రజల ఆర్థిక,సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని, పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా సేవలందించడం గొప్పగా భావిస్తున్నామన్నారు.ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ గ్రామీణ పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారంపై మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా గ్రామాల సర్పంచ్‌లను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసిసంబరాలు జరుపుకున్నారు. గుంద్రేవులలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసిన పీఎస్ రాజేష్ పంచాయతీరాజ్ చట్టాల గురించి వివరించారు.

**గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు**

**కల్లూరు:** గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని ఎంపీపీ బోయ శారద, ఎంపీడీఓ రమణమూర్తి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంను కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, అధికారులు వర్చువల్ విధానంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని తిలకించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, సుస్థిర అభివృద్ధి సూచికలు తదితర అంశాల్లో అభివృద్ధికి కృషి చేసిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈఓఆర్డీ రవికిషోర్, పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

**కర్నూలు (న్యూటౌన్):** ప్రజాస్వామ్య చరిత్రలో పంచాయతీలకు ప్రత్యేక స్థానం ఉందని పసుపుల గ్రామ పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కర్నూలు మండలం పసుపుల గ్రామ సచివాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సక్రమ నిర్వహణ దేశానికే ప్రగతి, అభివృద్ధికి సూచిక అని అన్నారు. అనంతరం గ్రామంలోని పారిశుద్ధ్య కార్మికులకు శాలువా, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. సర్పంచ్ బి.శీలమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి**

**కోడుమూరు రూరల్:** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచు భాగ్యరత్న సూచించారు. పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణంలో సర్పంచు భాగ్యరత్న ఈఓ అజయ్ భాస్కర్‌తో కలిసి కేక్ కట్ చేసి గ్రామ సభ నిర్వహించారు. వార్డుసభ్యులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పాణ్యం:** పాణ్యం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో సర్పంచ్ మేకల పల్లవి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ దస్తగిరి, ఈఓ అనురాధ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ పంచాయతీలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షించారు. సిబ్బంది పాల్గొన్నారు.

– అలాగే నెరవాడ గ్రామంలో సర్పంచ్ లింగాల శారదమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. గ్రామంలో చేపట్టిన అభివృద్ధిపై చర్చించారు. ఎంపీటీసీ పార్వతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగాల రాంభూపాల్‌రెడ్డి, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి , గ్రామ కార్యదర్శి జమాలయ్య , తదితరులు పాల్గొన్నారు.

–సుగాలిమెట్ట గ్రామంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం జరిగింది. సర్పంచ్‌లు దేవిబాయ్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు. గ్రామ సుస్థిరాభివృద్ధిపై చర్చించారు. గ్రామాల కార్యదర్శులు నాగేంద్రనాయక్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సి.బెళగల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు



కల్లూరులో పంచాయతీ రాజ్ దినోత్సవంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు



పసుపులలో పారిశుద్ధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న దృశ్యం

### ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డుల ప్రదానం



గడివేములలో అవార్డులు అందుకున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులతో జెడ్పీటీసీ, అధికారులు

**గడివేముల:** ఉత్తమ గ్రామపంచాయతీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించడం ద్వారా గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. మహాత్మగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి పల్లెలే పట్టుగొమ్మలని మహాత్మా గాంధీ అన్నారని, గ్రామాల అభివృద్ధికి అందరూ పాటుపడాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు సూచించారు. ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపికైన కొరటమద్ది, ఒండుట్ల, బొల్లవరం గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించి అవార్డులను అందజేశారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఈఓపీఆర్డీ ఖాలీక్, వైస్ ఎంపీపీ కాలునాయక్, ఎంపీటీసీ వంగాల మహేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# అనుమతులున్న విత్తనాలనే అమ్మాలి



సి.బెళగల్‌లో విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

**సి.బెళగల్:** ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ ధరకే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ ఆదేశించారు. ఆయన సోమవారం సి.బెళగల్‌లో ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలు, మందులను మాత్రమే రైతులకు ఇవ్వాలని, నిషేధిత మందులు, నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందుల కొనుగోలు దారులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, దుకాణం వద్ద ధరలు, స్టాకు బోర్డులను ప్రదర్శించాలని, రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. కొన్ని గ్రామాలలో దుకాణాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమాలకు పాల్పడే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీఈఓలు, వీఏఏఎస్‌లు వెంట ఉన్నారు.

## లోకోస్ యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న డీపీఎం ఐబి.దానం

**పాణ్యం:** స్థానిక పొదుపు కార్యాలయంలో సోమవారం లోకోస్ యాప్‌పై ఏపీఎంలకు, సీసీ, వీఓఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీపీఎం ఐబి.దానం, ఏసీ బాబురావు, ఏపీఎం పుణ్యవతి హాజరయ్యారు. పాణ్యం ఏపీఎం ఏవి.ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీపీఎం ఐబి.దానం మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంఘాల లావాదేవీలను మొబైల్ కి పింగ్ అనే యాప్‌లో నమోదు చేయడంలో ప్రథమస్థానంలో ఉన్నట్లు తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్ అప్లికేషన్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఈ యాప్ ద్వారా దేశంలోని ప్రతి సంఘం సమావేశాలు, లావాదేవీలను తెలుసుకోవచ్చారు. అలాగే ఆర్థిక లావాదేవీలు నమోదు చేస్తారని తెలిపారు. వివరాలన్నీ ఒకే యాప్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పది మండలాల ఏపీఎం, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

# స్పందనతోనే సమస్యల పరిష్కారం

**సి.బెళగల్:** ప్రజలు అర్జీల రూపంలో లేవనెత్తిన సమస్యలను మండల, గ్రామ స్థాయి అధికారులు వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదేశించారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో మండల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు తాగు, మురికినీటి సమస్యలు, ఇళ్ల పట్టాల సమస్యలు, అవసరాలపై అధికారులకు అర్జీలను ఇచ్చారు. స్పందన అనంతరం తహసీల్దార్ మండల, గ్రామ స్థాయి అధికారులతో పెండింగ్ సమస్యలు, స్పందన అర్జీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పందనలో ఎంపీడీఓ రాముడు, డీటీ సరళ, ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఇరిగేషన్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, సూర్యప్రకాష్, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

### చెన్నకేశవస్వామి ఆలయ భూముల వేలం

**ఓర్వకల్లు:** మండల కేంద్రంలో వెలసిన చెన్నకేశవ, ఆంజనేయ, నాగేశ్వర స్వామి ఆలయాలకు చెందిన భూములను ఏడాది పాటు కౌలుకు సాగుచేసుకునేందుకు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో మొత్తం 187 ఎకరాలకు వేలం పాట నిర్వహించగా రూ.18.10 లక్షలకు వేలం పాడి హక్కులను దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈఓ మద్దిలేటి, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కల్లూరు:** సల్కాపురంలో వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయ మాణ్యం భూమిని వేలంపాట ద్వారా కౌలుకు ఇస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం ఆలయం వద్ద గ్రామస్తులు సమావేశమయ్యారు. గ్రామంలోని సర్వే నంబర్ 71లో 15.01 ఎకరాలను ఐదు భాగాలు విభజించినట్లు తెలిపారు. వీటికి కౌలు ద్వారా ఏడాదికి రూ.1.79 లక్షలు ఆదాయం వస్తుందని, ఈ డబ్బును ఆలయ కమిటీకి జమచేసి దూప, దీప, నైవేద్యాలకు వినియోగించుకునేలా కమిటీ నిర్ణయించిందని గ్రామస్తులు తెలిపారు.

## డ్రాపవుట్లు నివారించాలి

**కల్లూరు:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల డ్రాపవుట్లను నివారించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం వెనుకబడిన తరగతుల స్టడీ సర్కిల్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌లతో సోషల్ ఆడిట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి శిక్షణ అధికారి (ఎంఆర్‌పీ) మాస్టర్ రిసోర్స్ పర్సన్‌గా విజయభాస్కర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధిలో హెచ్‌ఎంలతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలను స్కూల్ పర్ఫార్మెన్స్ టూల్ యాప్‌లో నమోదు చేయలన్నారు. నూతన విద్యా విధానం, మధ్యాహ్న భోజనం, మనబడి నాడు-నేడు ఫేజ్-2 పనులను ప్రధానోపాధ్యాయులు ఎస్‌టీఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

### అనాథ పిల్లలను కస్తూర్బాలో చేర్పించండి

**ఓర్వకల్లు:** బడిబయట ఉన్న వీధిబాలలు, అనాథ పిల్లలను కస్తూర్బా విద్యాలయంలో చేర్పించాలని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాల్ సూచించారు. సోమవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, భోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను కేజీబీవీలో చేర్పించాలనుకున్న వారు ఈ నెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. జిల్లాలో మొత్తం 26 పాఠశాలలు ఉండగా, ప్రతి పాఠశాలలో 6వ తరగతికి 40 సీట్లు, ఇంటర్మీడియట్‌కు 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. తల్లి/తండ్రిలేని బాలికలకు, బడిబయట ఉన్న బాలికలకు అడ్మిషన్లలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివరాలకు సమీపంలోని కస్తూర్బా పాఠశాలలను సంప్రదించాలని సూచించారు.

# జనం గుండెల్లో జగనన్న



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

**కల్లూరు:** 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి జనం నుంచి విశేష స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తామని ప్రజలు బాహాటంగా చెబుతున్నారని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల గడపకు ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక నాయకులు వెళ్లగా సాదర ఆహ్వానం లభిస్తోందని, అది తమలో ఎనలేని ఉత్సాహం నింపుతోందన్నారు. వృద్ధులు, లబ్ధిదారులు, మహిళలు సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని, ప్రభుత్వ పనితీరుపై పూర్తి విశ్వాసం తెలియజేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలను కొనసాగించాలని కోరుకుంటున్నారన్నారు.

గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల సిఫార్సులు ఉన్నవారికే పథకాలు అందేవని, 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను టీడీపీ తుంగలో తొక్కిందని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చి జనం గుండెల్లో చోటు సంపాదించుకున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాని, మునగాలపాడు నుంచి సమ్మర్‌స్టోరేజ్ పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. మే మొదటి వారంకల్లా పనులు పూర్తి అవుతాయన్నారు. అవసరమైన చోట్ల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇవి పూర్తయితే కర్నూలు నగరానికి తాగునీరు సరఫరా అయినట్లే కల్లూరు వార్డుల్లో రోజూ నీటి సరఫరా అయ్యేలా చేస్తామని పేర్కొన్నారు. రాయలసీమలో గోరుకల్లు రిజర్వాయర్, ఎస్ఆర్‌బీసీ, పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి ప్రాజెక్టులను నిర్మించారన్నారు.

### లోకేష్ వాస్తవాలు తెలుసుకో..

టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఏ నియోజకవర్గంలో ప్రవేశిస్తే ఆ ఎమ్మెల్యేపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. లోకేష్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఎక్కడ ఏమి మాట్లాడుతున్నారో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, పాణ్యం ఎంపీపీ హుస్సేన్‌బీ, కల్లూరు, ఓర్వకల్లు జెడ్పీటీసీలు ఆల ప్రభాకర్‌రెడ్డి, రంగనాథ్‌గౌడ్, జేసీఎస్ కన్వీనర్లు కేశవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ సారథి జగనన్న



న్యూకృష్ణానగర్‌లో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**కల్లూరు:** రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం 27వ వార్డు 68వ సచివాలయం పరిధిలోని న్యూ కృష్ణానగర్‌లో స్థానిక కార్పొరేటర్ పి.శారద, వార్డు నాయకులు కె.పుల్లారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రాఘవాచారి, పెద్ది, సురేష్‌కుమార్, గోపి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని నాయకులు, కాలనీ వాసులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఎమ్మెల్యే కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలో పర్యటిస్తూ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామన్నారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీలు, సీసీ రోడ్లు, కల్వర్టులు, ర్యాంప్‌లను నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కాలువలో పూడిక తొలగించాలని, పార్కును వినియోగంలోకి తేవాలని కోరారు. ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనంలో భాగంగా గుడ్లు, కూరగాయలను పరిశీలించారు. డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, కార్పొరేటర్లు శ్రీనివాసులు, మిద్దె చిట్టెమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, తిరుపాల్, బాలచంద్రారెడ్డి, సాయి, వెంకటరెడ్డి, సుబ్రహ్మణ్యం, బ్రహ్మానందరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### పంట మార్పిడితో ప్రయోజనం

**కోడుమూరు రూరల్:** రైతులు ఒకే రకమైన పంటలను సాగు చేయకుండా పంట మార్పిడి చేసుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. సోమవారం మండలంలోని ఎర్రదొడ్డి, అమడగుంట్ల రైతు భరోసా కేంద్రాలను ఏఓ రవిప్రకాష్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించడంతో పాటు, రైతులతో మాట్లాడారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన వారు వైఎస్సార్ రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే రైతులంతా పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవడంతో పాటు, మట్టి పరీక్షల ఆధారంగా ఖరీఫ్‌లో ఎరువుల వాడకం, పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఎవరైనా లూజు పత్తి విత్తనాలు అమ్ముతుంటే వారి సమాచారం తెలియజేయాలని తగుచర్యలు తీసుకుంటామని ఏఓ పేర్కొన్నారు. ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల జీతాలు చెల్లించండి

**కర్నూలు (న్యూటౌన్):** కర్నూలు నగర పాలక సంస్థ యాజమాన్యంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, అప్‌గ్రేడ్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు జీతభత్యాల చెల్లింపులను మండల విద్యాశాఖ పరిధిలో చెల్లించాల్సి ఉందని ఏపీ ఎంటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి, నగర అధ్యక్షుడు జీకే.శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి ఎస్.రాముడు ఎంఈఓ భాస్కర్ రావుకు విన్నవించారు. సోమవారం సాయంత్రం ఆయన్ను కలిసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు.

# పాణ్యం గ్రామ పంచాయతీకి అవార్డు



జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ మేకల పల్లవి, ఈఓ అనురాధ

**పాణ్యం:** పాణ్యం మేజర్ గ్రామ పంచాయితీకి జిల్లా స్థాయి అవార్డు వరించింది. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లాలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ మేకల పల్లవి, ఈఓ అనురాధకు అవార్డులు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పాణ్యం గ్రామ పంచాయతీకి సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో అవార్డు వరించడం సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతోనే పంచాయతీకి అవార్డు వచ్చిందన్నారు. భవిష్యత్తులో పంచాయతీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

### ఉత్సవాలను విజయవంతం చేద్దాం

**గడివేముల:** మండల పరిధిలోని దుర్వేశి గ్రామంలో వచ్చే నెల 20, 21 తేదీల్లో జరిగే లక్ష్మి చెన్నకేశవ స్వామి ఉత్సవాలను విజయవంతం చేద్దామని గ్రామపెద్దలు నాగభూషణంరెడ్డి, పుల్లారెడ్డి, శంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తలారి రంగస్వామి, వెంకటేశ్వర్లు, రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జెడ్పీటీసీ ఇంటి వద్ద వారు మట్లాడుతూ.. 21 ఏళ్ల అనంతరం జరుగుతున్న ఉత్సవాలను కొంతమంది అడ్డుకోవడం తగదన్నారు. గ్రామంలోని అన్ని వర్గాల అనుమతితోనే ఉత్సవాలు జరుపుతున్నట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా జయప్రదం చేయాలని కోరారు.